## (సఖినేటిపల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 2-3-97)

మీరు మంచి పనులు చేయవచ్చు. అంతమాత్రంచేతనే మోక్షంరాదు. మిమ్మల్ని మంచి పనులు చేయవద్దు అని ఆచార్యులవారు చెప్పటంలేదు. మంచిపనులు చెయ్యండి. దానివలన పుణ్యం వస్తుంది గాని మోక్షంరాదు. ఇప్పుడు మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. ఈ శరీరం చనిపోవటం, మరల కొత్త శరీరం రావటం. ఈ సంఘటనలు అన్నీ ఈ నిద్రలో జరిగిపోతున్నాయి. ఇది ఒక మహానిద్ర. ఈ అజ్ఞానమనే నిద్రలో నుండి నిన్ను మేల్కొలిపే వాడేగురువు. నీవు మంచిపనులు చేసినంతమాత్రంచేత ఇందులో నుండి మెలుకువరాదు. నీవు వేరు, నేను వేరు అనే వేరుబుద్ధి, బేధబుద్ధి నశిస్తే మోక్షం వస్తుంది గాని వేరుబుద్ధి ఉన్నంతకాలం నీవు ఎన్ని సత్కర్మలు చేసినా, ఎన్ని శాస్త్రములు చదివినా మోక్షంరాదు. వేరుబుద్ధితో మీరు మంచి పనులు చేయటం వలన పుణ్యం వస్తుందిగాని మోక్షం రాదు.

నీవు చేసే పని వలన లోకవాసన, దేహవాసన పెరగకూడదు. నీవు చేసే పని నిన్ను దేహానికి, ప్రపంచానికి బంధించేదిగా ఉండకూడదు. లోకవాసన, దేహవాసనల నుండి విడుదల చేయటానికి నీవు చేసే పని సహకరించాలి. బుద్ధుడుగాని, రమణమహర్షిగాని, ఆచార్యులవారుగాని మిమ్మల్ని పనులు చేయవద్దు అని చెప్పటం లేదు. పనులు మానివేస్తే మీ దేహయాత్రసాగదు. పనిచేసి దేహానికి, లోకానికి బంధింపబడకూడదు. ఏ వాసనను తొలగించుకోవటానికి ప్రయత్నం చేస్తున్నావో నువ్వు చేసేపని ఆవాసన నుండి విడుదల అవ్వటానికి నీకు సహకరించాలి గాని ఆ వాసనను పెంచేదిగా ఉండకూడదు. మంచి మాటలు విని ఉండాలి. అవి మన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు మనకి ఉపయోగపడతాయి. నీవు ఎన్ని శాస్త్రములు చదివినా, ఎంతపండితుడివి అయినప్పటికి నీలోపల ఉన్న సత్యవస్తువు నీకు అనుభవంలోనికి రాకపోతే నీ పాండిత్యం అంతా సున్నా.

ఉపన్యాసములు, రచనలు అవి నీ మనస్సుకు తాత్కాలికంగా ఆనందమును కలుగజేస్తాయిగాని నీమనస్సు నశిస్తేగాని, నీకు మోక్షంరాదు. నీ సుఖానికి దేహంమీదగాని, బాహ్యమైన విషయముల మీదగాని, వ్యక్తుల మీదగాని ఆధారపడకుండా నీ హృదయంలో ఉన్న సత్యవస్తువుమీద ఆధారపడి ఉన్నప్పుడు నీకు ఆత్మనిష్ట కలుగుతుంది. అప్పుడు వేరుబుద్ధి నశిస్తుంది. అప్పుడు నీకు మోక్షం కలుగుతుంది. స్వప్నంలో నీవు చేసిన పనులు మెలుకువ వచ్చాక అవి అసత్యం అని నీకు తెలుస్తోంది. వాటిగురించి నీకు గర్వంరాదు. అలాగే జాగ్రదావస్థలో నీవు చేసిన పనులు నీకు జ్ఞానం కలిగాక అవి అసత్యం అని తెలుస్తుంది అందువలన వాటిని చూసి గర్వపడవద్దు, నీవు ఏదైతే కాదో అది నీవు అనుకొంటున్నావు, దానితో తాదాప్యం పొందుతున్నావు. ఆ భావనలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నించాలి. నీవు కాని దానిలో నుండి విడుదల పొందిన మరుక్షణంలో నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు తానుగా నీకు వ్యక్తమవుతుంది. శాస్త్రములు చదివినంత మాత్రంచేత నీకు ఆత్మజ్ఞానం కలుగదు. నీకు ఆత్మజ్ఞానం కలిగితే శాస్త్రముతో పనిలేదు.

మనం అందరము అజ్ఞానము అనేపాము చేత కరువబడ్డాము. దీనికి డాక్టరు దగ్గరకు వెళ్ళి వైద్యం చేయించుకొంటే ఆ విషం బయటకురాదు. లోపల నువ్వు ఎవడో నీకు తెలిసే వరకూ, సత్యం నీకు ఎరుకపడేవరకూ అజ్ఞానము అనే పాము చేత కరువబడ్డ విషంలో నుండి బయటకురాలేవు. ఆచార్యులవారు

ఏమి చెపుతున్నారు అంటే నిన్ను అజ్ఞానము అనేపాము కరిచింది. ఆపాము యొక్క కాటులో నుండి విడుదల పొందటానికి నీలోపల ఉన్న సత్యవస్తువును సాక్షాత్కరించుకోవలసిందే ఇంకోమార్గంలేదు అంటున్నారు. సత్యవస్తువును తెలుసుకోవటానికి ప్రయత్నం చేయకుండా భజనలు చేయటం, చెట్లు చుట్టూ తిరగటం, మంత్రాలు, యాగాలు, మహిమలతో కాలక్షేపం చేస్తావు అనుకో అసలు సున్నా. అలాగని నామం చేయవద్దు అని చెప్పటంలేదు. ఏదో నామం చేస్తున్నాను, మోక్షం వస్తుంది అని ఎదురు చూడకండి, రాదు. రోజూ పారాయణలు చేస్తున్నాము ఇక్కడ పసుపు రాలుతోంది, అక్కడ కుంకుమ రాలుతోంది, అక్కడ బూడిద పడుతోంది అనుకోవటం వలన మోక్షంరాదు. ఇటువంటి వాటితో కాలమును వృధా చేసుకోవద్దు. ఏ వస్తువుకు అయితే మరణం లేదో ఆ వస్తువు మీకు అనుభవంలోనికి వచ్చే వరకూ మీరు అమృతస్థితిని పొందలేరు. దీనికి రాజీలేదు. అహంకారం ఎక్కడ ఉంది నీలోపల ఉంది. నీవు బయట చేసేపనుల వలన అదిపోదు. నుయ్యి త్రవ్వించావు ఎక్కడ త్రవ్వించావు బయట త్రవ్వించావు అది నీ అహంకారమును ఎలా పోగొడుతుంది. నీలోపల ప్రక్రియలవలన అది పోతుంది గాని బయట విషయముల వలన అది పోతుంది అనుకోవటం వెర్రితనం అంటున్నారు ఆచార్యులవారు. మంచి పనులు చెయ్యాలి. తెలుసుండి చెయ్యాలి. మంచి పనుల వలన చిత్తశుద్ధి కలుగుతుంది. మీరు మంచి పని చేసారు అనుకోండి 10 పైసలు పుణ్యం వస్తుంది. మీరు గుర్తింపుకోరుకుంటే 90 పైసలు అహంకారము పెరుగుతుంది. జీవితంలో మన ఇంద్రియాలతో చేసే ప్రతీ పనివలన మనస్సులో ముద్రలు పడిపోతాయి. ఇవి అన్నీ తాత్కాలికమైన ఆనందమును కలుగజేస్తాయి. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువు నీకు తెలిసేవరకూ నిజమైన ఆనందము నీకు కలుగదు.

నీ హృదయంలో మరణం లేని వస్తువుఉంది. దానిని తెలుసుకోవటమే నీ జీవిత గమ్యం. నీవు చేసే సాధన అంతా దానిమీద గురిపెట్టు. నీకు ఏదైనా రోగం వచ్చింది అనుకో. డాక్టరు దగ్గరకు వెళితే మందు వ్రాసి ఇస్తాడు. ఆ మందు కొనుక్కొని దానిని మ్రింగితే రోగం తగ్గుతుంది. మందు కొనుక్కొని దానిని మ్రింగకుండా ఆ మందు పేరును తలచుకోవటం వలన నీకు రోగం తగ్గుతుందా? తగ్గదు. అలాగే బ్రహ్మం, బ్రహ్మం అని అనుకోవటం వలన బ్రహ్మం నీకు తెలియదు. అది నీ హృదయంలో ఎంత లోతులలో ఉందో అంత లోతులలోనికి దిగితే బ్రహ్మం నీకు తెలుస్తుంది. నేను ఇక్కడ సోఫాలో కూర్చొని నేను ప్రధానమంత్రిని అని అనుకొంటే ప్రధానమంత్రిని అవుతానా? అవ్వను. అలా అంటూ ఉంటే పిచ్చి వాడు అంటారు. ప్రధానమంత్రి అవ్వాలంటే ఎలక్షన్‌లో నిలబడాలి, అందులో నెగ్గాలి, తరువాత అందరూ కలిసి నన్ను ఎన్నుకోవాలి అలా ఎన్నుకొంటే ప్రధానమంత్రిని అవుతాను. అంతేగాని ఇంట్లో కూర్చొని నేను ప్రధానమంత్రిని అనుకోవటం వలన నీవు అవ్వవు. అలాగే నేను బ్రహ్మంను, నేను బ్రహ్మంను అనుకోవటం వలన నీవు బ్రహ్మం అవ్వవు. ప్రధానమంత్రి పదవి ఒకటి ఉన్నమాట నిజమే అయితే అనుకోవటం వలన అది నీవు అవ్వవు. అలాగే బ్రహ్మం ఉన్నమాట నిజమే నేను బ్రహ్మంను అనుకోవటం వలన అది నీవు అవ్వవు. అది నీకు తెలియబడటానికి, బ్రహ్మం నీకు అనుభవంలోనికి రావటానికి ఏ బలహీనతలు అయితే అడ్డుగా ఉన్నాయో వాటిని సాధన చేసి తొలగించుకొంటే బ్రహ్మం నీకు అనుభవంలోనికి వస్తుంది. బ్రహ్మంనీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు దాని తాలుక సుఖం, శాంతి, ఆనందం నీకు తెలుస్తుంది. నీలో ఉన్నబలహీనతలను తొలగించుకోవటానికి ప్రయత్నంచేయాలి. ప్రయత్నం చేస్తూఉంటే ఈ జన్మలో సక్సెస్ అవ్వక పోతే తరువాత జన్మలో అయినా సక్సెస్ అవుతావు. ఈ సాధనాబలం, భావనాబలం తరువాత జన్మకు వస్తుంది.

నీకు ఇంట్లో ఎన్ని భోగములు ఉన్నా నీవు సుఖపడలేవు. మనోనిగ్రహం లేకపోతే నీకు సుఖంలేదు, శాంతిలేదు. నీ మనస్సు స్వాధీనంలో ఉండాలి. అప్పుడు నీకు శాంతి కలుగుతుంది. ఈశ్వరసంకల్పమునకు భిన్నంగా ఒక్క అంగుళం కూడా అటుఇటు కదపలేవు. జరిగేది అంతాఈశ్వర సంకల్పం. ఈసృష్టిలో ప్రతి సంఘటన ఈశ్వరసంకల్పం ప్రకారం నడుస్తోంది అని నీకు అర్థమయితే ఇప్పుడే ఈ క్షణంలోనే నీ దుఃఖం నశిస్తుంది. ఈశ్వరసంకల్పముతో మన సంకల్పమును ఐక్యం చేయలేకపోతున్నాము. నీ ఇష్టమే నా ఇష్టం అనుకొంటే వెంటనే దుఃఖం నశిస్తుంది. పూజచేయమంటే 24 గంటలు చేస్తారుకాని బ్రహ్మం గురించి శ్రవణం చేయమంటే చేయరు. హిందూమతంలో పూజకి ప్రాముఖ్యత ఎక్కువ, శ్రవణానికి ప్రాముఖ్యత తక్కువ. పూజల మీద ఉన్న ఆసక్తి శ్రవణం మీద లేదు. లోపల ఉన్న సత్యవస్తువు గురించి శ్రవణం చేయకుండా నీకు శ్రద్ధ ఎలా కలుగుతుంది, తెలుసుకోవాలనే బుద్ధి ఎలాకలుగుతుంది అంటున్నారు. వినటంలో ధృతరాష్ట్రుడిని గురువుగా పెట్టుకోవాలి. ఎంతసేపు చెప్పినా విసుగులేకుండా వినేవాడు. ఏదైనా మనం విన్నప్పుడు ఈ మాట మన జీవితానికి బాగా ఉపయోగపడుతుంది అని అనుకొంటే అది మీకు బాగా జ్ఞాపకం ఉంటుంది. సత్యంగురించి విసుగు లేకుండా వినాలి. విన్నదానిని మననం చేయాలి. శ్రవణం, మననం చేయగా చేయగా దేహబుద్ధి యొక్క వేరు కదులుతుంది.

నీ దేహానికి రోగం వస్తే అనేకమంది డాక్టర్ల దగ్గరకు తిరుగుచున్నావు. ఏదోరోజు చనిపోయే దేహం కోసం ఎన్నో తిప్పలు పడుతున్నావు. అలాగే నీ అజ్ఞానంలో నుండి బయటపడటానికి నీ తెలివితేటలు ఉపయోగించు, శాస్త్ర సహాయంతీసుకో, సత్పురుషులతో సహవాసం చెయ్యి. ఇవి అన్నీ చేయటానికి నీకు సిగ్గు వేస్తుందా అంటున్నారు ఆచార్యులవారు. ఏ వస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నావో దానిని నిరంతరము ధ్యానం చెయ్యాలి. ఆ వస్తువునే అంటిపెట్టుకొని ఉండాలి. మీరు నడుస్తున్నా, తింటున్నా, ఏపని చేస్తున్నా మీధ్యాస అంతా ఆవస్తువు మీదే ఉండాలి. సరళచింతన ఉండాలి, సతతం దానినే చింతిస్తూఉండాలి, నీలో ఉన్న అజ్ఞానం తెగిపోయే వరకూ నిరంతరం ఆవస్తువును ధ్యానం చెయ్యాలి. అలాగ నిరంతరం, విసుగు లేకుండా ధ్యానం చేస్తూఉంటే చైతన్య ప్రవంతిలో కలిసిపోతావు.

★★★